క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి, వల్లీదేవసేన ఉత్సవ విగ్రహాలు

బాడంగి: మండలంలోని పాల్తేరులో గల పార్వతీ మల్లికార్జునస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు రమేష్ పర్యవేక్షణలో కల్యాణ వేడుకలను సాలూరుకు చెందిన అల్లు ప్రభాకరరావు దంపతుల చేతుల మీదుగా చేపట్టారు. కార్యక్రమంలో పాల్తేరుతో పాటు మల్లంపేట, అలజంగి, తదితర చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

బోరుకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో పాడైన బోరుకు మున్సిపల్ యంత్రాంగం బుధవారం మరమ్మతులు చేపట్టారు. కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదేశాల మేరకు సిబ్బంది మరమ్మతులు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ ఉషారాణి

తెర్లాం: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో గల పిల్లల బరువులు, ఎత్తులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉన్న కూరగాయలు, ఆకుకూరల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెర్లాం సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ పిల్లలకు కార్యకర్తలంతా ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలన్నారు. రికార్డులను ఆఫ్‌లైన్‌లోను, ఆన్‌లైన్‌లోను కూడా నిర్వహించాలని సూచించారు. ఆమెతోపాటు తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి ఉన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత



రాజాం ప్రధాన రహదారిపై నిలిపిన ద్విచక్ర వాహనాలు

రాజాం: నగర పంచాయతీ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా షాపులు, బ్యాంకుల ముందు వైట్ మార్జిన్ దాటి వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ప్రధాన రహదారి మీదుగా ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ల వద్ద, ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య కేంద్రం, మున్సిపల్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కువగా నిలిపివేయడంతో ప్రజలు ఆయా కార్యాలయాల్లోకి వెళ్లలేకపోతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ..?

- యథేచ్ఛగా సాగునీటి కాలువపై కట్టడాలు
- పట్టించుకోని అధికారులు

తెర్లాం: పంట పొలాలకు సాగునీరు అందించే కాలువపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని పలువురు ఆయకట్టుదారులు, గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెర్లాంలోని దాసరిబందకు వర్షపు నీరు మళ్లించే కాలువ ఉంది. దీనిపై గతంలో కొంతమంది వ్యక్తులు అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారు. అప్పట్లో ఆయకట్టు రైతులు గ్రామ పంచాయతీ ఈఓ, తహసీల్దార్, ఎస్సై, బొబ్బిలి ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ, ఆర్ఐ గ్రామానికి చేరుకుని నిర్మాణాలు చేపడుతున్న వారిని హెచ్చరించారు. కొన్నేళ్లు ఆక్రమణదారులు పనులు ఆపి.. మళ్లీ తాజాగా నిర్మాణాలు చేపడుతున్నారు. సాగునీటి కాలువపై నిర్మాణాలు చేపట్టడం వల్ల పంట పొలాలకు నీరు ఎలా వెళ్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతున్నారు.



దాసరిబందకు సాగునీరు మళ్లించే కాలువపై అక్రమ నిర్మాణం

సాగునీరు అందేదెలా...?

- కాలువల్లో పేరుకుపోయిన చెత్త



రామభద్రపురం కూరాకుల చెరువు సాగునీటి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాగునీటి కాలువలు, మురుగునీటి కాలువలు పూడికలతో నిండిపోయాయి. గ్రామం నుంచి మురుగు నీరు, చెరువుల నుంచి సాగునీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోవడంతో అటు ప్రజలు, ఇటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఏ మాత్రం వర్షం పడినా సాగునీటి కాలువల ద్వారా మడకవాని చెరువుకు నీరు వెళ్లేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అలాగే గ్రామం మధ్యలో ఉన్న కూరాకులవాని చెరువు నిండితే మదుములు, చప్టాల ద్వారా సాగునీటి కాలువలకు నీరు వెళ్లేది. అయితే ఆ సాగునీటి కాలువలు కూడా పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. గ్రామంలోని మురుగునీటి కాలువల పరిస్థితి కూడా ఘోరంగా తయారైంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లోని పూడికలను తొలగించాలని కోరుతున్నారు.



చొక్కాపువీధి చివర మురుగునీటి కాలువలో పేరుకుపోయిన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లే బస్సులు..అలాగే ఒడిశా వెళ్లేందుకు కూడా రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గ్రామ శివారులో ఎన్‌హెచ్ 26 రహదారి ఉన్నా భారీ వాహనాలు మండల కేంద్రం మీదుగానే రాకపోకలు సాగిస్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రజలు కూడా కొంత మేర ఆక్రమణలు చేపట్టడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో ఎదురెదురుగా బస్సులు వచ్చినా, లారీలు వచ్చినా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాలు మండల కేంద్రం మీదుగా కాకుండా హైవేపై రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని ఇరుకు రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న బస్సులు

స్టూడెంట్ కిట్ల పంపిణీ

వంగర: మండలంలోని 49 పాఠశాలలకు సంబంధించి 3,053 కిట్లు మంజూరైనట్లు ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్న కిట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి కిట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పాఠశాలలకు చేర్చుతామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, సిబ్బంది ఉన్నారు.



కిట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వెంకటాపురంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అసిరినాయుడు

రేగిడి : మండలంలోని వెంకటాపురంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ అసిరినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు కె.రేణుక, ప్రసన్న, ఏఎన్ఎం స్వాతి, హెచ్ఎస్ కేవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పొదుపు రికార్డులను పరిశీలించారు. పొదుపు నిల్వతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపుపై ఆరా తీశారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, సీఏలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



కంచరాంలో వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం సిటీ: ఉపాధిహామీ పనులు చేపడుతున్న వేతనదారులు సమయపాలన పాటించాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండల పరిధి కంచరాం కొత్తచెరువులో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. అలాగే మస్తర్ల రికార్డును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. ఈయనతో పాటు ఈసీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులపై ఆరా

రాజాం: మండలంలోని కంచరాం, రాజయ్యపేట, గురవాం, తదితర గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించిన బిల్లులపై అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సాయిరాం బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వద్దకెళ్లి అన్ని వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాల్, ఆయా గ్రామాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎక్స్‌రే విభాగం సేవలు భేష్..

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఎక్స్‌రే విభాగం సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పలువురు రోగులకు బుధవారం ఎక్స్‌రే తీశారు. వ్యయప్రయాలకోర్చి ప్రైవేట్ లేబరేటరీల్లో ఎక్స్‌రేలు తీసుకోవాల్సిన అవసరం లేకపోవడంతో రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ పి. అప్పలనాయుడు మాట్లాడుతూ, రోజుకు పది మంది రోగులకు ఎక్స్‌రేలు తీయడం లక్ష్యం కాగా.. నెలకు 350 నుంచి 400 మందికి ఎక్స్‌రేలు తీస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 100 ఎంఏ సామర్థ్యం కలిగిన టెలిరేడియో ఫిజికల్ ఎక్సరే మిషన్ ద్వారా డిజిటల్ రేడియోగ్రఫీ ఫిల్మ్ ద్వారా ఎక్సరేలు తీస్తున్నామని తెలిపారు. కొత్త భవనం తయారైన తర్వాత 300 ఎంఏ మిషన్ వస్తుందని దానిద్వారా మరింత స్పష్టంగా రోగ నిర్ధారణ చేయవచ్చన్నారు.



ఎక్స్‌రే తీస్తున్న రేడియోగ్రాఫర్ నాయుడు

వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

రాజాం సిటీ: వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం, డ్రైయిన్స్ శుభ్రపర్చడం, ఎక్కడా నీటి నిల్వలులేకుండా చేయడం, దోమల నివారణ మందు పిచికారీ చేయడం వంటి పనులు చేయాలలన్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు.



పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మామిడితోటలో కందకాల ఏర్పాటు



వన్నలి మామిడి తోటలో కందకాలు ఏర్పాటు చేసుకుంటున్న రైతులు

రేగిడి: మండలంలోని వన్నలి, అంబకండి, సోమరాజుపేట, లింగాలవలస, తదితర గ్రామాల్లో రైతులకు సంబంధించిన మామిడి తోటల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కందకాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఏపీఓ ఎస్.హరినాథ్ బుధవారం పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి, మామిడి, తదితర తోటలు బాగు చేసుకునేందుకు ఉపాధిహామీ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పొనుగుటివలసకు చెందిన రెడ్డి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన తండ్రి అప్పలనాయుడు మాస్టారు జ్ఞాపకార్థం సంతకవిటి రోడ్డులో బుధవారం పది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమకు అనుకూలమైె ప్రదేశంలో మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇనుమల శ్రీను, పి.చంద్రరావు, తమ్మయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు



కాలువలో పూడికలు తీస్తున్న కార్మికులు

తెర్లాం: మండలంలోని కూనాయవలసలో రెండు రోజులుగా పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. సర్పంచ్ విజయబాబు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. పనులను పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి పర్యవేక్షిస్తున్నారు.

జోరుగా విత్తనాల పంపిణీ

- అటు అధికారులు, ఇటు రైతన్నలు బిజీబిజీ



బొబ్బిలి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద అన్‌లోడ్ చేస్తున్న విత్తనాలు

బొబ్బిలి: ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండడంతో విత్తన సరఫరాలో అధికారులు, సాగు సన్నద్ధతలో రైతులు బిజీగా ఉన్నారు. డివిజన్‌లోని ఆయా మండలాల వ్యవసాయాధికారులు ఆర్‌బీకేలకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నారు. బొబ్బిలి డివిజన్‌కు సంబంధించి 5,985 క్వింటాళ్ల వరి విత్తనాలు ఆర్‌బీకేలకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి రైతన్నలు వరి విత్తనాలను ఇళ్లకు తీసుకెళుతున్నారు. వరి విత్తనాల్లో రకాన్ని బట్టి 25, 30 కిలోల బ్యాగుల్లో విక్రయిస్తున్నారు. మొత్తం 9 రకాల విత్తనాలను రాయితీపై అందజేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఎ.డి ఎం. శ్యామ్‌సుందరరావు విత్తన రకాలు, ధర, బ్యాగుల బరువు, తదితర వివరాలను సరిగ్గా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏఓలు, ఆర్‌బీకే సిబ్బందికి సూచనలు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరి, తదితర విత్తనాలతో పాటు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. పిల్లిపెసర, కట్టెజనుము, తదితర పచ్చిరొట్ట ఎరువులను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. రాయితీపై అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గ్రామాల్లోని ఆర్‌బీకేలకు తరలిస్తున్న విత్తన బ్యాగులు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



రేగిడి: జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఐసీఆర్‌పీ

- ఏఓ మురళీకృష్ణ

రేగిడి : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయవలసలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామానికి చెందిన ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ ప్రకృతి వ్యవసాయంపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారన్నారు. వారు అందించిన సూచనలు, సలహాలతో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. సేంద్రియ ఎరువులను ఇంటివద్దే తయారు చేసుకోవాలన్నారు. ఆవుపేడ, వేపాకులు, గోమూత్రం వంటి వాటితో జీవామృతాన్ని తయారు చేసుకుని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

భూమికి మేలు..

వంగర: ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు జరుగుతుందని సంబంధిత విభాగం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండల పరిధిలోని కింజంగిలో ప్రకృతి వ్యవసాయం సాగులో భాగంగా నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంటల సాగుకు ముందు నవధాన్యాలు విత్తనాలు చల్లి, 40 రోజుల అనంతరం దుక్కి చేస్తే భూసారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ రమ్య, ఐసీఆర్‌పీ పోలినాయుడు పాల్గొన్నారు.



వంగర: నవధాన్యాల కిట్లను రైతులకు అందిస్తున్న సింహాద్రినాయుడు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పాడైన బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల పర్యవేక్షణలో పనులు జరుగుతుండడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– రేగిడి/తెర్లాం



రేగిడి : లక్ష్మీపురంలో బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు



తెర్లాం : చీకటిపేటలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది